సాక్షి రంగారెడ్డి

బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



పరువు కోసం ప్రాణం..

పరువు పోతుందని భావించిన ఓ కుటుంబం యువకుడిని హతమార్చిన ఘటన కేశంపేట పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. 8లో▸



రైతు శ్రేయస్సే లక్ష్యం

రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 8లో▸

నేటి నుంచి గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: నగరవాసుల కోసం ఆర్టీసీ నూతనంగా 'గ్రీన్ మెట్రో లగ్జరీ' ఏసీ బస్సుల్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. బుధవారం నుంచి ఇవి పరుగులు తీయనున్నాయి. మొత్తం 50 గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ సర్వీసుల్లో మొదటి విడతగా 25 బస్సులు వస్తున్నాయి.

న్యూస్‌రీల్

బాలాపూర్ గణేశ్‌కు మంత్రి సబిత పూజలు



బాలాపూర్ గణనాథుని సన్నిధిలో మంత్రి సబితారెడ్డి తదితరులు

బడంగ్‌పేట్: బాలాపూర్ గణనాథుని మొదటి రోజు పూజలో మంత్రి సబితారెడ్డి పాల్గొన్నారు. నిర్వాహకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న మంత్రికి లడ్డూ ప్రసాదం అందజేశారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని గణనాథున్ని వేడుకున్నట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, నాయకులు కౌసిక్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డి, శశిధర్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు రఘునందన్ చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ



విద్యార్థిని సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న వాకాటి కరుణ

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతోందని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. డీఈవో సుశీందర్‌రావుతో కలిసి మంగళవారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులకు వెళ్లి బోధన పరమైన అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోనే మన విద్యా వ్యవస్థ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలు మారాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభ్యున్నతికి, విద్యార్థుల బోధన తీరును పరిశీలించిన అనంతరం ప్రధానోపాధ్యాయుడు సురేశ్‌ను ఆమె అభినందించారు.

బీజేపీ జిల్లా అర్బన్ అధికార ప్రతినిధిగా సురేష్‌కుమార్



హుడాకాంప్లెక్స్: బీజేపీ జిల్లా అర్బన్ అధికార ప్రతినిధిగా సరూర్‌నగర్ డివిజన్‌కు చెందిన బీ సురేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. బీజేపీ సిద్ధాంతాలు, ఆదర్శాలకు అంకితమై నీతి, నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో వ్యవహరిస్తానని, సహచర కార్యకర్తలు పార్టీ కమిటీలతో కలిసి అన్ని కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి ఉద్యమాలు చేపట్టడం ద్వారా పార్టీని సంస్థాగతంగా పటిష్టపరిచి అన్ని వర్గాలలో మరింత విస్తరించడానికి కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఢిల్లీ ఎయిమ్స్ స్థాయిలో ఎంఎన్‌జే సేవలు

మంత్రి హరీశ్‌రావు

నాంపల్లి: ఎంఎన్‌జే ఆస్పత్రిలో అధునాతన రోబోటిక్ సర్జికల్ సిస్టమ్‌తో లాప్రోస్కోపిక్ ఎక్విప్‌మెంట్‌ను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించారు. సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే ఆస్పత్రిలో స్థానిక ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్, ఎమ్మెల్సీ ఎంఎస్.ప్రభాకర్ రావు, టీఎస్‌ఎంఎస్ఐడీసీ చైర్మన్ శ్రీనివాస్, డీఎంఈ రమేష్ రెడ్డి, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఎంఎన్‌జే డైరెక్టర్ జయలతతో కలిసి పరికరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో రూ.32 కోట్లతో అధునాతన రోబోటిక్ సర్జికల్ సిస్టమ్, రూ.50 లక్షలతో లాప్రోస్కోపిక్ ఎక్విప్‌మెంట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ఎంఎన్‌జే ఆస్పత్రి స్వరూపాన్నే మార్చేసినట్లు తెలిపారు. 750 పడకల ఆస్పత్రిగా దేశంలోనే అతి పెద్ద కేన్సర్ ఆస్పత్రిగా ఎంఎన్‌జే రికార్డు నెలకొల్పిందన్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్ సేవలతో సమాన స్థాయిలో నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. త్వరలోనే దేశంలోనే తొలిసారిగా ఎంఎన్‌జే ఆస్పత్రిలో ఆంకాలజీ స్పెషల్ నర్సింగ్ స్కూల్‌ను ప్రారంభిస్తామ ఆయన వెల్లడించారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధమే



5,389 వీవీ ప్యాడ్స్, 5,483 కంట్రోల్ యూనిట్లు

- 6,961 బ్యాలెట్ యూనిట్లు రెడీ
- ఓటింగ్ యంత్రాల పనితీరు పరిశీలన పూర్తి
- 521 సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా
- డబుల్ ఓట్లను గుర్తించాం
- 'సాక్షి'తో కలెక్టర్ హరీష్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే గత ఎన్నికల సమయంలో వెలుగు చూసిన వివాదాలను, పోలింగ్ శాతాన్ని పరిశీలించి, ఆయా కేంద్రాలపై ఓ అంచనాకు వచ్చాం. ఓటరు జాబితా మొదలు.. ఓటింగ్ శాతం నమోదు వరకు.. ఇలా ప్రతి అంశాన్ని పరిశీలించాం. వచ్చే ఎన్నికల్లో ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం ఇవ్వబోం' అని కలెక్టర్ హరీష్ చెప్పారు. ఎన్నికల ఏర్పాట్లపై ఆయన 'సాక్షి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. వాటిని సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధం. ఇందుకు 5,389 ఈవీఎంలు, 5,483 కంట్రోలర్స్, 6,961 బ్యాలెట్ ప్యాడ్లు సిద్ధం చేశాం. ఇప్పటికే రాజకీయ పార్టీల నేతల సమక్షంలో ఆయా ఓటింగ్ యంత్రాల పనితీరును పరిశీలించాం. బ్యాలెట్ ప్యాడ్ ఓపెన్ చేసిన సమయం, తేదీ, క్లోస్ చేసిన సమయం, నమోదైన ఓట్లు వంటి అంశాలను పూర్తిగా చెక్ చేశాం.

రాజేంద్రనగర్‌లోనే అత్యధిక సమస్యాత్మక కేంద్రాలు

2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల మధ్య చోటు చేసుకున్న గొడవలు, ఒకే అభ్యర్థికి 90 శాతం పైగా ఓట్లు నమోదు కావడం, మిస్సింగ్ ఓట్లు అధికంగా ఉన్న పోలింగ్ స్టేషన్లు గుర్తించారు. ఆయా పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించాం. ఇలా జిల్లా వ్యాప్తంగా 521 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తేలింది. వీటిలో అత్యధికంగా రాజేంద్రనగర్‌లో 119, మహేశ్వరంలో 83, శేరిలింగంపల్లిలో 37, చేవెళ్లలో 58, కల్వకుర్తిలో 66, షాద్‌నగర్‌లో 48 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించి, వాటిపై ఈ సారి ప్రత్యేక దృష్టి పెట్టాం.

1.57 లక్షల బోగస్ ఓట్లు తొలగించాం

జిల్లాలో 3,33,991 డబుల్ ఓట్లు ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆ మేరకు డోర్ టు డోర్ విచారణ చేపట్టాం. వీటిలో 1,73,454 ఓట్లను రిటర్న్ చేశాం. మరో 1,57,000 ఓట్లు తొలగించాం. 6,800 మంది ఓటర్లు చనిపోయారు. జనవరి నుంచి ఇప్పటి వరకు కొత్తగా ఓటు నమోదుకు 2.28 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీరిలో 18 నుంచి 19 ఏళ్ల వయసు వారు 47వేల మంది వరకు ఉన్నట్లు తేలింది. అక్టోబర్ 4వ తేదీ ఓటరు తుది జాబితా విడుదలకు అన్ని చర్యలు చేపట్టాం.

3,369 పోలింగ్ కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా, వీటి పరిధిలో 3,369 పోలింగ్ కేంద్రాలు ఎంపిక చేశాం. మొత్తం 31,99,674 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 16,62,692 మంది పురుషులు, 15,35,537 మంది మహిళలు, 384 మంది ట్రాన్స్ జండర్లు, 195 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు, 866 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు.

శేరిలింగంపల్లిలోనే అత్యధిక ఓటర్లు

ఇబ్రహీంపట్నంలో 3,01,397 మంది ఓటర్లు, ఎల్బీనగర్‌లో 5,46,779 మంది ఓటర్లు ఉన్నారు. మహేశ్వరంలో 4.92,278 మంది, రాజేంద్రనగర్‌లో 5,19,949 మంది ఓటర్లు ఉన్నారు. శేరిలింగంపల్లిలో అత్యధికంగా 6,62,607 మంది ఓటర్లు ఉన్నారు. చేవెళ్లలో 2,44,214 మంది ఓటర్లు, కల్వకుర్తిలో 2,21,296 మంది ఓటర్లు ఉండగా, షాద్‌నగర్‌లో 2,11,112 మంది ఓటర్లు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా



కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన వాకాటి కరుణ, కలెక్టర్

- ఓటరు జాబితా పరిశీలకులు వాకాటి కరుణ
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా, పారదర్శకంగా ఓటరు తుది జాబితా రూపకల్పన జరగాలని ఓటరు జాబితా పరిశీలకులు, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ హరీష్‌తో కలిసి ఈఆర్‌ఓలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు కోరుతూ దాఖలైన దరఖాస్తుల వివరాలను కలెక్టర్ ఆమె దృష్టికి తెచ్చారు. అనంతరం వాకాటి కరుణ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నియమ నిబంధనలు ప్రకారం పక్కాగా ఓటరు జాబితా రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఎక్కడైనా పొరపాట్లు, తప్పిదాలను గుర్తిస్తే ఎన్నికల రిటర్నింగ్ అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. బోగస్ ఓటర్లకు ఆస్కారం లేకుండా రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చొరవ చూపాలన్నారు. 18, 19 సంవత్సరాల వయస్సు కలిగిన వారి విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, షాద్‌నగర్, మహేశ్వరం, ఎల్‌బీనగర్, శేరిలింగంపల్లి, రాజేందర్ నగర్, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు సంబంధించి రెండో విడత ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులు, మార్పులు, చేర్పులపై ఆరా తీశారు. గత ఏడాది నవంబర్ 9 నుంచి ఇప్పటివరకు జిల్లాలో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలపై కలెక్టర్ హరీష్ వివరించారు. బీఎల్‌ఓలు, సూపర్ వైజర్లు ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించి అనుసరిస్తున్న పద్ధతుల గురించి వాకాటి కరుణ అడిగి తెలుసుకున్నారు. కొత్త ఓటర్ల నుంచి స్పందన ఎలా ఉంది అని ఆరా తీశారు. గ్రామాల్లో ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం చేశారా, ఇంటింటి సర్వే సందర్భంగా గమనించిన అంశాలు ఏమిటని ఆరా తీశారు. చనిపోయిన వ్యక్తుల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించే ముందు కుటుంబ సభ్యుల నుంచి నిర్ధారణ చేసుకోవాలని, మరణ ధ్రువీకరణ పత్రం లేకపోయినా సంబంధిత మున్సిపల్, గ్రామ పంచాయతీ నుంచి వివరాలు సేకరించి ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇతర ప్రాంతానికి వలస వెళ్లిన వారి గురించి సంబంధిత పోలింగ్ కేంద్రం అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారి సైదులు, ఈఆర్ ఓలు, ఏఈఆర్‌ఓ లు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన కొలనులివే !

- ఏర్పాట్లు చేస్తున్న బల్దియా అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: గణేశ్ విగ్రహాల నిమజ్జనం కోసం జీహెచ్‌ఎంసీ మూడు రకాల కొలనుల్ని గ్రేటర్ వ్యాప్తంగా ఏర్పాటు చేస్తోంది. నాలుగడుగుల వరకు ఎత్తున్న విగ్రహాలను ఎక్కడికక్కడే స్థానికంగా నిమజ్జనం చేసేందుకు ఈ ఏర్పాట్లు చేస్తోంది. పెద్ద విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయనుండటం తెలిసిందే. తక్కువ ఎత్తున్న విగ్రహాల నిమజ్జనాల కోసం 74 కొలనులు (పాండ్స్) ఏర్పాటు చేస్తున్నారు.

జోన్ల వారీగా పోర్టబుల్ పాండ్స్ ఇలా..

ఎల్‌బీనగర్ జోన్: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, ఏఎస్‌రావు నగర్, సచివాలయనగర్ ఆఫీసర్స్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ గ్రౌండ్స్, ఎమ్మార్వో ఆఫీస్, హయత్‌నగర్, ప్రభుత్వ కళాశాల మైదానం, మున్సిపల్ కార్యాలయం వెనుక.

చార్మినార్ జోన్: కృష్ణ తులసినగర్ పార్క్, శివాలయం గ్రౌండ్, రియాసత్‌నగర్, లక్ష్మణేశ్వర ప్లేగ్రౌండ్, జంగమ్మెట్, ఎస్‌బీఏ గార్డెన్ ఎదుట (100 అడుగుల రోడ్డు).

ఖైరతాబాద్ జోన్: నిజాంకాలేజ్ ప్లే గ్రౌండ్, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ , అమీర్‌పేట ప్లే గ్రౌండ్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఎస్‌టీటీ నగర్.

శేరిలింగంపల్లి జోన్: ఐ–మాక్స్ థియటర్ వెనుక, పీజేఆర్ స్టేడియం, చందానగర్, సాకి చెరువు, పటాన్‌చెరు.

కూకట్‌పల్లి జోన్: చిత్తారమ్మగుడి, వివేకానందనగర్, హెచ్‌ఎంటీ బహిరంగ స్థలం, ఈఎస్ఐ ఆస్పత్రి పక్కన, కౌకూర్ పార్క్, వాటర్ ట్యాంక్ దగ్గర.

అర్హులందరికీ పథకాలు

- ఎంపీ రంజిత్‌రెడ్డి
- ఘనంగా జన్మదిన వేడుకలు



ఎంపీ రంజిత్‌రెడ్డికి గజమాల వేస్తున్న నాయకులు

షాబాద్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఎంపీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఎంపీని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు శ్రీనివాస్‌గౌడ్, వెంకటయ్య, నర్సింహారెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మి తదితరులు ఎంపీని కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఇమ్రాన్, ముఖరం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి శ్రమిద్దాం

- హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్
- పార్టీలో పలువురి చేరిక



చేవెళ్ల: బీజేపీలో చేరిన వారితో ఈటల రాజేందర్

చేవెళ్ల: బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. మొయినాబాద్ మండలం సురంగల్ గ్రామంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చేవెళ్ల మండలం మల్కాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, పంచాయతీ వార్డు మెంబర్ జైపాల్‌గౌడ్ పార్టీలో చేరారు. అనంతరం ఈటల మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో యువత ఎంతో ఉత్సాహంగా బీజేపీ వైపు ఉన్నారని, వారు కష్టపడి పనిచేస్తే పార్టీ అధికారంలోకి రావటం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, నియోజకవర్గం నాయకుడు విజయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు డీ పాండు రంగారెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శర్వలింగం, తదితరులు పాల్గొన్నారు.

అతీగతీ లేని 'ప్రాణహిత – చేవెళ్ల'

మొయినాబాద్ రూరల్: 2005లో ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించినా నేటికీ అతీగతీ లేదని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని సురంగల్ గ్రామంలో గుమ్మాల సీతరామరెడ్డి రైతుల కోసం క్రిమి సంహారక మందులు, మహిళలు, వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈటల, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకుడు యశ్వదామరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును పదేళ్ల పాటు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరో పదేళ్లు నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు శాంతి, సుఖం లేదన్నారు. జిల్లా అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. గుమ్మాల సీతరామరెడ్డి నిరుపేదలకు అండగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అంజన్‌కుమార్ గౌడ్, తులసీరాం విజయకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో బీఆర్‌ఎస్ విఫలం

- ఏఐసీసీ పర్యవేక్షకులు దీపదాస్ మున్షి
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం



కాంగ్రెస్ ఆరు గ్యారంటీ కార్డు గురించి ప్రజలకు వివరిస్తున్న దీపదాస్ మున్షి, నర్సింహారెడ్డి తదితరులు

మీర్‌పేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందని కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ, ఏఐసీసీ పరిశీలకులు దీపదాస్ మున్షి ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ హామీలను ప్రజలకు వివరించేందుకు సోమవారం మీర్‌పేట పరిధిలోని దాసరి నారాయణరావు కాలనీ, కమలా నగర్‌లో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డితో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. ఎన్ని రాజకీయ ఒత్తిళ్లు ఉన్నా నాడు సోనియాగాంధీ ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తుచేశారు. తెలంగాణ ఇస్తే కలిసి నడుస్తామని చెప్పిన కేసీఆర్ తరువాత మాట మార్చారని ఆరోపించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చి హామీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అందుకే ప్రజలంతా కేసీఆర్‌ను ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబంలో ముగ్గురు మంత్రులు ఉన్నారని, కానీ రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ జరగడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, ఇతర పథకాల నిధులను వేరే పథకాలకు మళ్లిస్తున్నారని అన్నారు. అవినీతిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అగ్రస్థానంలో ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతి నెలా రూ. 2,500, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా కింద ప్రతి సంవత్సరం అన్నదాతలకు, కౌలు రైతులకు రూ. 15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ. 12వేలు, వరి పంటకు రూ.500 బోనస్, గృహ జ్యోతి పథకం ద్వారా ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు లేని పేదలకు స్థలంతోపాటు రూ.5లక్షలు, ఉద్యమకారులకు రూ. 250 చదరపు గజాల స్థలం, యువ వికాసం కింద విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్, చేయూత పథకం ద్వారా నెలకు రూ. 4వేల పెన్షన్, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్య బీమాను అందజేస్తామని అన్నారు. అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించడమే సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల ఆకాంక్ష అని అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంటు ఇన్‌చార్జ్ జ్యోత్స్న, నాయకులు భాస్కర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్ణ, శ్రీశైలం, గంగమ్మ, సురేందర్‌రెడ్డి,వెంకటేష్‌గౌడ్, భాస్కర్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ కార్డు'తో సమూల మార్పులు

షాద్‌నగర్ రూరల్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలతో పేదల జీవితాలలో సమూల మార్పులు వస్తాయని మణిపూర్ మాజీ సీఎం ఓక్రమ్ ఇబోబి సింగ్ అన్నారు. షాద్‌నగర్‌లోని ఫరూఖ్‌నగర్‌లో పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో సోమవారం ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే మహిళలు, రైతులు, విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రజల మధ్య, మతాల మధ్య చిచ్చు పెట్టడమే బీజేపీ ధ్యేయమని అన్నారు. ఇందుకు మణిపూర్ ఘర్షణలే నిదర్శం అన్నారు. బీజేపీతో బీఆర్‌ఎస్ దోస్తీ రాష్ట్రానికి ఎంతో ప్రమాదకరమని అన్నారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతోందని మండిపడ్డారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన క్యాదర్శి అమీర్‌ఖాన్, మణిపూర్ ఎమ్మెల్యే లండోక్, బాబర్ అలీఖాన్, చెన్నయ్య, తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, ముబారక్‌అలీ, ముబీన్‌ఖాన్, సిద్ధార్థ, శ్రీకాంత్‌రెడ్డి, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీను నాయక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన

కడ్తాల్: కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు డాక్టర్ చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. ఏఐసీసీ కార్యక్రమంలో భాగంగా కొండ్రిగాన్‌బోడ్ తండా పరిధిలోని పెద్దారెడ్డి చెరువు తండాలో పల్లెనిద్ర చేసిన ఆయన సోమవారం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికి వెళ్లి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తుక్కు గూడ విజయభేరి సభలో సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరించారు. అనంతరం మైసిగండిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో ఇటు రాష్ట్రం, అటు కేంద్రంలో అధికారమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు బీచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, జగన్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, సర్పంచులు శంకర్, సేవ్యా, రాము, భారతమ్మ, నరేందర్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

బియ్యం పంపిణీ అడ్డుకున్న అంగన్‌వాడీలు

కొందుర్గు: గర్భిణులకు, బాలింతలకు ఉచితంగా అందజేసే బియ్యం పంపిణీని అంగన్‌వాడీ కార్యకర్తలు అడ్డుకున్నారు. మంగళవారం కొందుర్గు బీసీ కాలనీలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ జ్యోత్స్న బియ్యం పంపిణీ చేయాలని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ, ఐటీయూసీ నాయకులతో అక్కడికి చేరుకొని బియ్యం పంపిణీని అడ్డుకున్నారు. ఈ ఘటనపై సూపర్‌వైజర్ జ్యోత్స్న పోలీసులకు సమాచారం చేరవేసింది. అక్కడికి చేరుకున్న ఎస్ఐ కృష్ణయ్యతోపాటు మహిళా పోలీసులు అంగన్‌వాడీలను సముదాయించే ప్రయత్నం చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు పంపిణీ చేసేదిలేదని అంగన్‌వాడీ కేంద్రం ఎదుట టీచర్లు, ఆయాలు బైఠాయించారు. సీడీపీఓ నాగమణి అక్కడికి చేరుకొని సముదాయించిన కూడా వారు వినలేదు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగయ్య, గోపాల్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొందుర్గు: ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం పూరి జిల్లా జల్లీశ్వర్‌పొండ గ్రామానికి చెందిన ప్రణబ్‌పలవురి(40) నాలుగు నెలల క్రితం కొందుర్గుకు వలసవచ్చి దివ్యశక్తి పేపర్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 17న రాత్రి పరిశ్రమలోని సంపు వద్ద స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి సంపులో పడిపోయాడు. కింద పడిపోయిన ప్రణబ్‌పలవురిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండు రోజులుగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి హరాస్‌పలవురి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ ఒక్కటే.. మూడు నంబర్లు


ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేసిన లారీ

చాదర్‌ఘాట్: మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు రిజిస్ట్రేషన్ నంబర్లతో తిరుగుతున్న లారీని మంగళవారం ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఓల్డ్‌మలక్‌పేట పోచమ్మ దేవాలయం వద్ద రోడ్డుపై వెళుతున్న ఇటుక లారీకి మూడు వైపుల వివిధ రిజిస్ట్రేషన్ నెంబర్లు ఉండటాన్ని గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు లారీని సీజ్ చేసారు. లారీ వివరాలు ఆర్‌టీఓ అధికారులకు పంపించి కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. లారీ ముందు భాగంలో ఏపీ03 యూ8183, వెనుక ఏపీ28యూ3618, పక్కన ఏపీ03కే8183 నంబర్లు ఉండటం గమనార్హం.

పరువు కోసం ప్రాణం తీశారు

- పెళ్లి విషయం మాట్లాడుదామని పిలిపించి యువకుడి దారుణ హత్య
- పొలంలో పాతిపెట్టిన వైనం
- ఆగస్టు 15న ఘటన
- మృతుడి సోదరుడి ఫిర్యాదుతో పోలీసుల రంగప్రవేశం
- ప్రకాశం జిల్లా అద్దంకిలో నిందితులు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీసీపీ నారాయణరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి


కరణ్‌కుమార్ (ఫైల్)

షాద్‌నగర్ రూరల్: ఆ యువకుడు వావి వరుసలు మరిచాడు.. వరుసకు కూతురయ్యే బాలికతో ప్రేమ వ్యవహారం నడిపాడు.. ఎన్ని సార్లు నచ్చజెప్పినా వినిపించుకోలేదు.. దీంతో పరువు పోతుందని భావించిన బాలిక కుటుంబ సభ్యులు యువకుడిని హతమార్చారు. మృతుడి సోదరుడి ఫిర్యాదుతో పోలీసులు యువకుడి అదృశ్యం కేసును ఛేదించారు. మంగళవారం పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు.

ఐదేళ్ల క్రితం వలస వచ్చి..

బీహార్ రాష్ట్రం వైశాలి జిల్లా బహార గ్రామానికి చెందిన రంజిత్ కుమార్ పాస్వాన్ కుటుంబం, దీపక్ కుమార్ పాస్వాన్ కుటుంబం ఐదు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం తెలంగాణ ప్రాంతానికి వలస వచ్చారు. ఇరు కుటుంబాల సభ్యులు మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం ఉడిత్యాల గ్రామ శివారులోని కోళ్ల ఫారంలో పని చేస్తున్నారు. ఆ సమయంలో రంజిత్ కుమార్ పాస్వాన్ పెద్ద కూతురును దీపక్ కుమార్ పాస్వాన్ తమ్ముడు కరణ్‌కుమార్ ప్రేమించాడు. కరణ్‌కుమార్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించడాన్ని బాలిక తండ్రి రంజిత్‌కుమార్ పాస్వాన్ గమనించాడు. నువ్వు నాకు తమ్ముడివి అవుతావని, నా కూతురు నీకు బిడ్డ వరుస అవుతుందని, ఇలాంటి విషయాలు మరిచి పోవాలని కరణ్‌కుమార్‌ను హెచ్చరించాడు.


ఘటనా స్థలంలో మృతదేహాన్ని వెలికి తీస్తున్న పోలీసులు

నచ్చజెప్పినా మారని తీరు

బాలిక ప్రేమ విషయంలో కరణ్‌కుమార్‌లో మార్పు రాకపోవడంతో రంజిత్ కుమార్ పాస్వాన్ తన కుటుంబాన్ని తీసుకొని మెదక్ జిల్లాలోని నస్కల్‌కు వెళ్లాడు. దీపక్ కుమార్ పాస్వాన్ తన తమ్ముడిని తీసుకొని సిద్దిపేటకు వెళ్లాడు. ఆ సమయంలో కరణ్ కుమార్ నస్కల్ వచ్చి బాలికను తీసుకొని వెళ్లిపోయాడు. బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇద్దరిని రప్పించి నచ్చజెప్పి పంపించారు. బాలికను వివాహం చేసుకున్నట్లుగా ఫొటోలను కరణ్‌కుమార్ వారి సొంత గ్రామం సోషల్ మీడియాలో వేశాడు. దీంతో గ్రామంలో, బంధువుల వద్ద పరువు పోయిందని భావించిన రంజిత్ కుమార్ పాస్వాన్ తన కుటుంబంతో రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం నిర్దవెల్లి గ్రామ శివారులోని కోళ్ల ఫారంలో పని చేసేందుకు వచ్చారు.

పరువు పోతుందని ప్రాణం తీశారు

రంజిత్‌కుమార్ పాస్వాన్ కుటుంబంతో ప్రతివారం నిర్దవెల్లిలో జరిగే సంతకు వచ్చేవారు. ఆ సమయంలో కరణ్‌కుమార్ చాటుగా వచ్చి బాలికను కలిసి మాట్లాడి వెళ్లేవాడు. ఎప్పటిలాగే కరణ్‌కుమార్ ఆగస్టు 15న సంతకు వచ్చిన విషయాన్ని తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు మీ పెళ్లి విషయం మాట్లాడుదామని కరణ్‌కుమార్‌ను పిలిపించుకున్నారు. అదే రోజు రాత్రి సుమారు 11:30 నిమిషాలకు రంజిత్‌పాస్వాన్, మంతోష్‌కుమార్, డబ్లూకుమార్‌తో పాటు ఇద్దరు మైనర్లు కరణ్‌కుమార్‌ను గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల వద్దకు తీసుకువెళ్లి దాడిచేసి అతిదారుణంగా హత్య చేశారు. పొలంలో గొయ్యితీసి శవాన్ని పూడ్చిపెట్టి ఎవరికి అనుమానం రాకుండా మళ్లీ వరి నాటు వేశారు. విషయం బయటకు తెలుస్తుందనే ఆలోచనతో రంజిత్‌పాస్వాన్ కుటుంబంతో ప్రకాశం జిల్లా అద్దంకికి వెళ్లిపోయారు.

సోదరుడి ఫిర్యాదుతో..

మృతుడి సోదరుడు దీపక్‌కుమార్‌పాస్వాన్ తన తమ్ముడు కేశంపేట వెళ్లి తిరిగి రాలేదని కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో ఆగస్టు 29న ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాలతో దర్యాప్తును ముమ్మరం చేశారు. సాంకేతిక ఆధారాలతో నిందితులను అద్దంకిలో అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ శ్రీరాంకుమార్, ఏసీపీ రంగస్వామి, సీఐ లక్ష్మిరెడ్డి, ఎస్ఐలు దేవకి, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

రైలు ఢీ కొని..
గుర్తు తెలియని వ్యక్తి మృతి

నందిగామ: రైలు ఢీ కొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నందిగామ శివారులోని నూజివీడు సీడ్స్ పరిశ్రమ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. నూజివీడు పరిశ్రమ వెనకాల రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి(35) మృతదేహం ఉందని మంగళవారం ఉదయం స్థానికులు సమాచారం ఇచ్చారన్నారు. సోమవారం రాత్రి ఆ వ్యక్తిని రైలు ఢీ కొని మృతిచెంది ఉంటాడని అన్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారన్నారు.

రైతు శ్రేయస్సే లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- సబ్సిడీపై యంత్ర పరికరాలు పంపిణీ
- భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు మెండు

తుర్కయంజాల్: రైతు సేవా సహకార సంఘాలు వ్యాపార దృష్టితో కాకుండా రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్, డీసీసీబీ వైస్ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన మంగళవారం సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు రాయితీపై ఎరువులు, విత్తనాలతో పాటు వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై పంపిణీ చేయాలని సూచించారు. సహకార సంఘాన్ని రాష్ట్రంలో ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలపాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వంతో మాట్లాడి కొహెడలో గోదాముల నిర్మాణానికి భూమిని సమకూర్చిన విషయాన్ని గుర్తుచేశారు. 199 ఎకరాల్లో నిర్మించనున్న పండ్లమార్కెట్ ఆసియా ఖండంలోనే అతిపెద్దదని రూ.450 కోట్లతో త్వరలో సీఎం కేసీఆర్ మార్కెట్ పనులను ప్రారంభించనున్నారన్నారు. మలక్‌పేటలోని గంజ్‌ను కూడా కొహెడకే తరలించనున్నారని, భవిష్యత్తులో స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనుందన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రానున్న రోజుల్లో మంచి భవిష్యత్తు ఉండబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో జిల్లా కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాలకు వెళ్లి రావాలంటే ఒక రోజు సమయం పట్టేదని, నేడు సమీపంలోకే కార్యాలయాలు రావడంతో ప్రజాపాలన సులువైందన్నారు. బొంగ్లూర్ ఔటర్ రింగ్ రోడ్డు వరకు మెట్రో విస్తరించనున్నారని, 20 ఏళ్ల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. డీసీసీబీ ఛైర్మన్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు సహకార సంఘాలు పనిచేస్తున్నాయన్నారు. అనంతరం సంఘం సెక్రటరీ రాందాస్ సొసైటీ ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. జిల్లా రైతు బంధు అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, వైస్ ఛైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరక్టర్లు కొంద్రు స్వప్న శ్రీనివాస్, జక్క రాంరెడ్డి, చాపల యాదగిరి, సామ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున సోదరి నాగ సుశీలపై కేసు

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ తెలుగు సినిమా హీరో అక్కినేని నాగార్జున సోదరి అక్కినేని నాగసుశీలపై మొయినాబాద్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. భూ తగాదా నేపథ్యంలో సుశీలతో పాటు మరో 12 మంది తన ఇంటిపై, తనపై దాడి చేశారని చింతలపూడి శ్రీనివాస్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు నాగసుశీలపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అయితే తన అనుమతి లేకుండా శ్రీనివాస్ భూమి విక్రయించాడని నాగ సుశీల ఆరోపించడంతో అతడిపై కూడా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నాగ సుశీల, శ్రీనివాస్ గతంలో వ్యాపార భాగస్వాములుగా ఉండేవారు. శ్రీ నాగ్ ప్రొడక్షన్ పేరుతో నాగ సుశీల కుమారుడు అక్కినేని సుశాంత్ హీరోగా అతను కరెంట్, అడ్డా, కాళిదాసు, ఆటాడుకుందాం రా తదితర చిత్రాలను నిర్మించారు. ఇదిలా ఉండగా.. శ్రీనివాస్ ఓ ట్రస్ట్‌కు భూమిని విరాళంగా ఇచ్చినట్లు తెలిసింది. ఈ భూ వ్యవహారంలో శ్రీనివాస్, నాగ సుశీలకు మధ్య చాలా కాలంగా తగాదాలు జరుగుతున్నట్లు సమాచారం.

ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు

సాక్షి,సిటీబ్యూరో: జిల్లా గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడిగా కొణతాల ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు. ట్రస్మా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్ పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా షేక్ సయీద్ అహ్మద్, కోశాధికారిగా మంచాల రఘు ఎన్నికయ్యారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారులు, కార్యవర్గ సభ్యుల సహకారంతో హైదరాబాద్ జిల్లాలో గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

త్వరలో సమస్యలు పరిష్కరిస్తాం


ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- అంగన్‌వాడీల దీక్షా శిబిరం సందర్శన

కడ్తాల్: త్వరలోనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో టీచర్లు, హెల్పర్‌లు చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరాన్ని మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్‌లతో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగులకు అండగా నిలిచిందన్నారు. అన్ని రంగాల్లో పనిచేస్తున్న క్రింది స్థాయి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల గౌరవ వేతనాన్ని, జీత భత్యాలను పెంచిదన్నారు. అంగన్‌వాడీల వేతనాన్ని రూ.4 వేల నుంచి రూ.13,600లకు, ఆయాలకు రూ.2వేల నుంచి 7,600లకు పెంచిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు. పీఆర్సీ, ఫిట్‌మెంట్‌ను గతంలోనే ప్రభుత్వం పెంచిందని, అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్నారు. సంబంధిత నివేదికలు తెప్పించుకుని, న్యాయం చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ విషయంలో సంబంధిత మంత్రి సత్యవతి రాథోడ్ అంగన్‌వాడీ ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చలు జరిపారన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ఆయాసంఘాల నాయకులు కార్మికులను రెచ్చగొట్టేల వ్యవహరించడం బాధాకరమన్నారు. అనంతరం అంగన్‌వాడీ ఉద్యోగులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్ గంప శ్రీనివాస్, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కొత్తూరు: లారీ ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన తిమ్మాపూర్ చౌరస్తా కూడలీ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. సీఐ శంకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ పట్టణంలోని నెహ్రూకాలనీకి చెందిన యాదయ్య(50) మహేశ్వరం మండలంలోని ఓ వెంచర్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. షాద్‌నగర్ నుంచి మహేశ్వరం వెళ్లేందుకు తిమ్మాపూర్ చౌరస్తా కూడలీ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో కొత్తూరు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలైన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


వెంకటేశ్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..ఇబ్రహీంపట్నంకు చెందిన పగడాల వెంకటేశ్(42) జనహర్ష‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల భార్య గొడవపడి పిల్లలతో సహా పుట్టింటికి వెళ్లిపోయింది. వినాయక చవితి పండుగకు ఆమె ఇంటికి రాకపోవడంతో మనస్థాపానికి గురైన వెంకటేశ్ రెండు రోజుల క్రితం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గమనించి మంగళవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీ కొని..
వెటర్నరీ వైద్యుడి మృతి


దినేశ్ (ఫై

పహాడీషరీఫ్: కారు ఢీ కొన్న ఘటనలో వెటర్నరీ వైద్యుడు మృతి చెందాడు. ఈ సంఘటన పహాడిషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లా జిల్లా ముస్తాబాద్ మండలం పొడుగల్లు గ్రామానికి చెందిన దినేశ్(35) వెంటర్నరీ వైద్యుడుగా విధులు నిర్వహిస్తున్నాడు. రెండేళ్ల నుంచి జల్‌పల్లి సమీపంలోని ఆర్‌ఆర్ డెయిరీ ఫామ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రోజు మాదిరిగానే 11.30 గంటలకు విధులు ముగించుకొని ఆర్‌ఆర్‌మసాల కంపెనీ రోడ్డున ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న స్విఫ్ట్ కారు బలంగా ఢీ కొట్టింది. తీవ్ర గాయాలపాలైన అతన్ని చికిత్స నిమిత్తం ఒవైసీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం 2.30 గంటలకు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాహనం టైరు మారుస్తుండగా..
కారు ఢీకొని వ్యక్తి మృతి

ఆలేరురూరల్ : వాహనం టైరు మారుస్తుండగా కారు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్, రాజేంద్రనగర్‌కు చెందిన అశ్వినికుమార్ పాండే(30) సోమవారం రాత్రి అశోక్ లీలాండ్ వాహనంలో అల్లం, వెల్లుల్లి బస్తాలు లోడ్ చేసుకుని వరంగల్‌కు బయలుదేరాడు. అర్ధరాత్రి దాటాక వాహనం ఆలేరు శివారులోని బహదూర్‌పేట హైవే బ్రిడ్జి వద్దకు చేరుకోగానే టైర్ పంక్చర్ అయ్యింది. దీంతో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి టైరు మరుస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు అశ్వినికుమార్‌ను ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి సంతోష్‌పాడే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటశ్రీను తెలిపారు.

కేన్సర్ వచ్చిందేమోనని..
భయంతో యువకుడి ఆత్మహత్య



జీడిమెట్ల: తనకు కేన్సర్ వచ్చిందేమోననే భయంతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతల్‌కు చెందిన సత్యనారాయణ కుమారుడు శరత్(19) స్థానిక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం అతడికి రక్తంతో కూడిన వాంతి అయ్యింది. దీంతో తనకు కేన్సర్ సోకిందేమోనని శరత్ ఆందోళనకు గురైన శరత్ ఈ విషయాన్ని తల్లి లక్ష్మీబాయికి చెప్పగా, తెలపగా వినాయక చవితి మరుసటి రోజు మంచి అస్పత్రిలో పరీక్షలు చేయిస్తానని చెప్పింది. అయినా శరత్ తనలో తాను మదన పడేవాడు. సోమవారం లక్ష్మీబాయి వినాయకుడి పూజ నిమిత్తం మండపం వద్దకు వెళ్లింది. రాత్రి 7 గంటలకు ఆమెకు ఫోన్ చేసిన శరత్ త్వరగా ఇంటికి రావాలని చెప్పి ఫోన్ పెట్టేశాడు. లక్ష్మి ఇంటికి చేరుకోగానే తలుపులు మూసి ఉన్నాయి. తలుపులు తెరచి లోపలికి వెళ్లి చూడగా శరత్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. స్థానికుల సహాయంతో అతడిని కిందకు దింపి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.